సాక్షి
చిత్తూరు

సోమవారం । 3 । జూన్ । 2024



**ఫలితం వచ్చాకే బయటకు..**

ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాతే కౌంటింగ్ కేంద్రం నుంచి ఏజెంట్లు బయటకు వెళ్లాల్సి ఉంటుంది. - 8లో



**బోయకొండకు భారీ ఆదాయం**

బోయకొండ గంగమ్మఆలయానికి ఆదివారం ఒక్కరోజే భారీగా ఆదాయం వచ్చిన చైర్మన్, ఈఓ తెలిపారు. - 8లో

**గాలీవానకు రూ.25 లక్షల నష్టం**



చిత్తూరులో గాలీవానకు రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. - 8లో

## న్యూస్‌రీల్

### కెమెరాలతో నిఘా



చిత్తూరు పోలీసుల వద్ద క్యూఆర్‌టీ వాహనాలు

**చిత్తూరు అర్బన్:** సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడడానికి మరికొద్ది గంటలే సమయం ఉండడంతో జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రతల విఘాతానికి సమస్యలు వస్తే వెంటనే రంగంలోకి దిగడానికి చిత్తూరు పోలీసులు క్యూఆర్‌టీ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. క్విక్ రియాక్షన్ టీమ్స్ (క్యూఆర్‌టీ) పేరిట అయిదు పోలీసు వాహనాలకు కెమెరాలను అమర్చారు. ఇవి పోటీలో ఉన్న అభ్యర్థుల కదలికలు తెలుసుకోవడంతో పాటు రాజకీయ పార్టీల కార్యాలయ వద్ద జరుగుతున్న జన సమీకరణ, సమావేశాలను కూడా రికార్డు చేస్తాయి. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు సమాచారం వస్తే వెంటనే రంగంలోకి దిగడానికి క్యూఆర్‌టీ వాహనాలు సిద్ధంగా ఉంటాయని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.

### గుడిపాల ఎస్‌ఐ శ్రీనివాసరావు సస్పెన్షన్

**చిత్తూరు అర్బన్:** గుడిపాల ఎస్‌ఐ శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతనెల జరిగిన సార్వత్రిక ఎన్నికల నాడు గుడిపాల మండలంలోని మందిక్ష్మాపురం పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఏజెంటుగా ఉన్న సురేష్‌పై టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై ఎన్నికల సంఘం జిల్లా యంత్రాంగం నుంచి నివేదిక కోరింది. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగడం, విధుల్లో ఎస్‌ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు నివేదించారు. దీంతో ఈసీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ అనంతపురం డీఐజీ షిమోషి ఉత్తర్వులు జారీ చేశారు.

### అబ్జర్వర్ల నియామకం

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో కౌంటింగ్ పర్యవేక్షణకు ఎన్నికల సంఘం అబ్జర్వర్‌లను నియమించింది. వారు జిల్లా కేంద్రానికి విచ్చేశారు. అబ్జర్వర్లు ఈ నెల 4వ తేదీన సంబంధిత నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు తీరును పర్యవేక్షిస్తారు. జిల్లాలోని అభ్యర్థులు ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉన్నట్‌లైతే అబ్జర్వర్లకు తెలియజేవచ్చని అధికారులు వెల్లడించారు. షాదిక్ అలం (చిత్తూరు-928144832), కవిత మానికేరి (పుంగనూరు-9281448301), భరత్ భూషన్ (నగరి-9281448315), మమత (పలమనేరు, కుప్పం - 9281448306), శశాంక్ సింహా (గంగాధరనెల్లూరు, పూతలపట్టు-9281448309), కైలాష్ (చంద్రగిరి-9281778307) నెంబర్లలో తెలియజేయవచ్చని అధికారులు తెలిపారు.

### ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరం ఎస్వీసెట్ కాలేజీలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. కౌంటింగ్ రూమ్‌లను సందర్శించి అక్కడి పరిస్థితులు, ఏర్పాట్లను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియ పటిష్టంగా జరగాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో జేసీ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, ఇలియాస్ భాష, పావన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



**ప్లాన్-1**

- కౌంటింగ్ కేంద్రంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లను రెచ్చగొట్టే విధంగా కొందరు పోలీసులు వ్యవహరించేవిధంగా ప్రణాళిక రచించినట్టు సమాచారం.
- ఓట్ల లెక్కింపులో కావాలనే కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని కౌంట్‌లోకి వేసే ప్రయత్నం చేయనున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.
- ఆ విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు గ్రహించి అభ్యంతరం వ్యక్తం చేసేలోపే అందుకోసమే అక్కడ ఎదురు చూస్తున్న పోలీసులు, కౌంటింగ్ అధికారులు కొందరు సంబంధిత ఏజెంట్లను, స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లను వెలుపలకు పంపేందుకు కుట్రపన్నుతున్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

**ప్లాన్-2**

- ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపేందుకు వీలుకాని పక్షంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూటమి అభ్యర్థులకు అనుకూలంగా వేసేందుకు కొందరు పోలీసులు, అధికారులు ప్రయత్నాలు ప్రారంభించనున్నట్టు సమాచారం.
- ఎన్నికల కమిషన్ నిబంధనలు, వాస్తవ నిబంధనలను భేరీజు వేసుకుని ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేయనున్న నేపథ్యంలో కౌంటింగ్ చివరి నిమిషంలో కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన ఓట్లను వారి ఖాతాల్లో వేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.
- అధికారులు కొందరు కూటమి అభ్యర్థుల ఆమ్యామ్యాలకు లొంగి వారికి అనుకూలంగా మెజారిటీకి అవసరమైన కొన్ని ఓట్లను వారికి కలిపేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం.



# కన్నింగ్ ఖాకీలు

- పోలింగ్ రోజునే టీడీపీ నేతలకు మద్దతుగా విధులు
- నిత్యం కూటమి అభ్యర్థులతో టచ్‌లో ఉన్న కొందరు 'పచ్చ' పోలీసులు
- ఓట్ల లెక్కింపు కేంద్రంలో వీరి వల్లే గొడవలకు ఆస్కారం?
- ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకే కౌంటింగ్ డ్యూటీ?

ఓట్ల లెక్కింపు రోజున అల్లర్లకు టీడీపీ నేతలు పన్నాగాలు పన్నుతున్నారా..? అనుకూల ఫలితాలు రాకుంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని కుట్ర చేస్తున్నారా..? అందులో భాగంగానే తమకు చెంచాగిరీ చేసే ఖాకీలకు బందోబస్తు విధులు కేటాయించేలా పథకం రచించారా..? కౌంటింగ్ కేంద్రంలో ఏం జరుగుతోందో క్షణ క్షణం తమకు సమాచారం అందించేలా ప్రణాళిక రూపొందించారా..? పచ్చమూకను పురిగొల్పేందుకు కన్నింగ్ ఖాకీల సహకారం తీసుకోనున్నారా..? ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తోంది. కౌంటింగ్ నాడు గొడవలు చేసేందుకు టీడీపీ నాయకులు ఏకంగా కొందరు వివాదాస్పద పోలీసులను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది.

**సాక్షి, టాస్క్‌ఫోర్స్ :** మరో 24 గంటల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభంకానుంది. జిల్లా యంత్రాంగం ఇందు కోసం పక్కాగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. అయితే ఈనెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజున ఖాకీ దుస్తులు వేసుకున్న కొందరు అధికారులు కూటమి అభ్యర్థులకు మద్దతుగా అరాచకం సృష్టించేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. అనుకున్న ఫలితాలు రాకుంటే ఓట్ల లెక్కింపు కేంద్రంలో గలాటాలు చేయడానికి సహకరించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎప్పటికప్పుడు కౌంటింగ్ సెంటర్‌లో జరిగే పరిణామాలను పచ్చ పార్టీ నేతలకు చేరవేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఓట్ల లెక్కింపు కేంద్ర వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికే పచ్చ పార్టీ నాయకులు ఏకంగా కొందరు ఖాకీలను ఎంపిక చేసుకున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించకుంటే తీవ్ర పరిణామాలకు కొందరు ఖాకీలే మూలకేంద్రంగా మారనున్నారనే భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

**ఆ గొడవల్లో ప్రమేయం**

పోలింగ్ రోజు, తదనంతరం జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న ఘర్షణలు, పరిణామాలు తెలియనివి కావు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులే లక్ష్యంగా టీడీపీ నేతలు దాడులు చేసి, కొందరిని మట్టుబెట్టాలని భారీ ప్రణాళికలు వేశారు. నడిరోడ్డుపైనే రౌడీయిజం చెలాయించి తిరుపతి వాసులను భయభ్రాంతులకు గురిచేశారు. తీరా ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించడంతో భయపడిన పచ్చ పార్టీ నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ మొత్తం వివాదంలో కొందరు పోలీసు అధికారుల ప్రత్యక్ష ప్రమేయం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నా ఇప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ నాయకులపైకి ఉసిగొలిపి దాడులు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది కొందరు పోలీసు అధికారులేనని బలంగా వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతలను రెచ్చగొట్టి, కవ్వింపు చర్యలకు పాల్పడి.. ఆపై దాడులు చేసేలా పథకం వేసినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ నేతల స్వీయ రక్షణలో జరిగిన చిన్నపాటి గొడవను భూతద్దంలో చూపించి, ప్రజలను భయకంపితులు చేయాలని కొందరు పోలీసులే పక్కా ప్లాన్ వేసినట్లు తెలిసింది. ఈ కుట్రలో పలువురు సీఐలు, ఎస్‌ఐల నుంచి కింది స్థాయి కానిస్టేబుళ్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పక్కాగా స్కెచ్!**

ఎన్నికల వేళ గొడవలు చేసేందుకు తిరుపతి నగరానికి చెందిన ఓ మొబైల్ దుకాణం యజమాని.. కొందరు పోలీసు అధికారులు కలిసి జట్టుగా ప్రణాళిక రూపొందించినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ నేతలను రెచ్చగొట్టి, ఎవరూ చూడకుండా దాడులు చేయాలని ఆ మొబైల్ దుకాణంలో స్కెచ్ వేసినట్లు వెల్లడిస్తున్నారు.. ఇందు కోసం పలువురు సీఐలు, ఎస్‌లకు వాట్సాప్ కాల్స్ చేసి వాళ్ల సహాయం కూడా తీసుకున్నారని చెబుతున్నారు. పోలింగ్ జరిగిన రోజున, తర్వాత ఈ కుట్రలో భాగస్వాములైన పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మొబైల్ దుకాణం యజమానితో టచ్‌లో ఉన్నట్లు బలంగా వినిపిస్తోంది. వీళ్ల సూచనలతోనే కేవలం టీడీపీ నాయకులపై జరిగిన దాడులను ఎల్రక్టానిక్ పరికరాలతో రికార్డు చేసేలా ఓ పన్నాగం పన్నినట్లు తెలిసింది. పైగా వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద అంగరక్షకులుగా ఎవరెవరు ఉన్నారు..? షిఫ్టులో ఎవరు మారుతున్నారు..? లాంటి వివరాలు సేకరించి కూటమి నేతలకు ఉప్పందించినట్లు సమాచారం. కచ్చితంగా అధికారంలోకి వస్తామని, వచ్చిన వెంటనే తమకు అండగా నిలిచిన అధికారులను అందలం ఎక్కిస్తామని కూటమి నేతలు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**పొంచి ఉన్న ముప్పు!**

ఈ మొత్తం గొడవల్లో ప్రధానంగా కొందరు పోలీసు అధికారుల పేర్లు వినిపిస్తోంది. తిరుపతి క్రైమ్‌లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు, స్పెషల్ బ్రాంచ్ వెస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారి, స్పెషల్ బ్రాంచ్ అలిపిరి పరిధిలో పనిచేస్తున్న ఓ ఉన్నతోద్యోగి, తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కీలక అధికారి, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోని చిన్నస్థాయి సిబ్బంది. వెస్ట్ స్టేషన్ ఉన్నతాధికారి, అలిపిరి స్టేషన్‌లో పనిచేసి సస్పెండ్ అయిన ఓ ఉన్నతోద్యోగి. ఈస్ట్ పోలీస్ స్టేషన్ చిరుద్యోగి, తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ నుంచి వీఆర్ కెళ్లిన ఓ ఉన్నతాధికారికి కూటమి అభ్యర్థులతో ప్రత్యక్ష సంబంధాలున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు సాక్ష్యాలను సైతం సేకరించారు. వీరికి కౌంటింగ్ కేంద్రంలో విధులు వేస్తే.. ఎంతకైనా తెగిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ముందస్తుగా పొంచి ఉన్న ముప్పును పసిగట్టాలని అభ్యర్థిస్తున్నారు. కన్నింగ్ ఖాకీలకు కౌంటింగ్ విధులు కేటాయించొద్దంటూ ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

# గరుడ విహారి గోపాల..

- గరుడ వాహనంపై దర్శనమిచ్చిన వేణుగోపాలుడు
- కార్వేటినగరంలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



గరుడవాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు



పుష్పపల్లకీపై విహరిస్తున్న వేణుగోపాలుడు

**కార్వేటినగరం:** కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. టీటీడీ అనుబంధంగా ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఐదోరోజు అశేష భక్తుల గోవింద నామస్మరణ, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్త బృందాల నృత్య ప్రదర్శనల నడుమ స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 వరకు మోహినీ అవతారంలో పల్లకిలో నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితులు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు విశేషాలంకృతుడైన వేణుగోపాలుడు గరుడ వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో 10 గంటల వరకు విహరించారు. ఈ సందర్భంగా గరుడ వాహన గోవిందా.. వేణుగోపాల గోవిందా అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. డిప్యూటీ ఈఈ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టు నారాయణదాశరథి, వేద పండితులు గోపాలాచారి, తరుణ్‌కుమార్, అలంకార భటులు, టీటీడీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రూ.50 వేలు విరాళం..**

టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కార్వేటినగరం ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ దంపతులు స్వామివారి ఉత్సవ నిర్వహణకు రూ.50 వేలు విరాళం అందించారు. అలాగే స్వామివారి ఊరేగింపులో పాల్గొనే భక్తులకు, గ్రామస్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని, అలాగే కళత్తూరు కృపాలక్ష్మి 2024 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

**నేడు వసంతోత్సవం**

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం 7.30 నుంచి 9.30 వరకు స్వామివారు హనుమంత వాహనంపై స్వామివారు ఊరేగుతారని ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 4 వరకు స్వామివారికి వసంతోత్సవం జరుగుతుందని, అలాగే సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి స్వామివారు గజవాహనంపై పుర వీధుల్లో విహరిస్తారని తెలిపారు.

# ఎగ్జిట్‌పోల్స్‌ను నేను నమ్మన్రా సామీ !

- రేపు చూడబ్బా కథ వేరేగా ఉంటాది
- ఆడోళ్లంతా ఫ్యాన్‌కు దంచేశారప్పా సామీ
- టీకొట్లలో హాట్‌టాపిక్‌గా మారిన సర్వేల కొట్లాట

**పలమనేరు:** ఏమినా శీనప్పన్నా ఓ పేపర్లో వైఎస్సార్‌సీపీదే అధికారమని, కాదు కూటమిదేనని మరో పేపర్లో వేశారు.. నేనైతే ఈ ఎగ్జిట్‌పోల్స్‌ను అసలు నమ్మనునా, ఏమంటావునా శీనప్పన్నా అన్నాడు రాజప్ప. రే రాజా నీవు అట్లంటావు, నాకైతే ఫోన్‌లో చూశాక సరిగ్గా నిద్రేరావడం లేదన్నాడు రాజప్ప. కాదునా ఇంతకు ముందెప్పుడూ ఇట్లాలేదబ్బా.. ఓరే సామీ సెంట్రల్‌లో బీజేపీ గెలుస్తుందని అక్కడి జాతీయ మీడియా, ఇక్కడేమో వైఎస్సార్‌సీపీ, టీడీపీలు గెలుస్తాయని చెరో ఏడు సర్వే సంస్థలు చెబుతుంటే నాయకులేమో గానీ మనలాంటి వాళ్లకు టెన్షన్ తప్పలేదబ్బా అన్నాడు. నువ్వు ఎలా డిసైడ్ చేస్తావునా అంటే ఏదో ఓ పార్టీ గ్యారెంటీగా గెలుస్తుందని జనం నాడి బయట పట్టలేదురా సామీ, ముఖ్యంగా మన ఆడోళ్లు ఏ పార్టీకైతే ఓటేశారో అదే గెలుస్తుందని నా నమ్మకం అన్నాడు శీనప్ప. ఓరే రాజా ఇప్పటిదాకా సర్వేచేసి వెల్లడించేవాళ్ల మాటలు నిజం అయ్యేవిరా.. కానీ ఈ ఎన్నికల్లో సర్వే వాళ్లు డబ్బుల కోసం కక్కుర్తి పడి వారికి అనుకూలమైన పార్టీలకు అనుకూలంగా చెబుతాండరని జనానికి తెలిసిందిరా సామీ అన్నాడు. అవును నిజమేనన్నా గతంలో తెలంగాణాలోనూ ఇట్లాగే, అంతకుందుకు లగడపాటిని నమ్మి జనం మోసపోలేదా అన్నాడు రాజప్ప. ఓరే సామీ ఈ దఫా సర్వే చేసిన వాళ్ల మాటలు నీటిమూటలు కావడం ఖాయం.. మరోసారి ఎన్నికల్లో ఎవరైనా సర్వేల కోసం వస్తే మూతి పగలడం ఖాయంరా సామీ అన్నాడు. టీకొట్టులో వీరి మాటలు విన్న మిగతావారు మీకెందుకయ్యా గొడవ సామీ.. ఇంకో 24 గంటలు తట్టుకోలేరా..? సర్వే వాళ్లే చెప్పింది జరిగేటట్టుంటే ఇంకా ఎన్నికల ఫలితాలు ఎవరికో సమయ్యా బాబు అంటూ వారిద్దరికీ సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు.

# కండలేరు జలాశయం గేట్ల పరిశీలన

**రాపూరు:** మండలంలోని కండలేరు జలాశయాన్ని ఆదివారం తెలుగుగంగ సీఈ రమణ, ఎస్ఈ రమణారెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ కండలేరు జలాశయం హెడ్ రెగ్యులేటర్ గేట్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని రిపేరు చేసే నిమిత్తం పరిశీలించినట్లు వెల్లడించారు. హెడ్ రెగ్యులేటర్ గేట్లు రిపేరుకు సుమారు కోటి రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. అలాగే జలాశయంలోపల ఉన్న రివిట్‌మెంట్ దెబ్బతిందని, ఈ రివిట్‌మెంట్ 7వ కిలోమీటర్ నుంచి 9.5 కిలోమీటర్ వరకు అలల తాకిడికి రాళ్లు లేచిపోయాయని చెప్పారు. విటి మరమ్మతులకు సుమారు రూ.13 కోట్లు అవసరమని తెలిపారు. త్వరలో ఈ రెండు పనులకు టెండర్లు పిలవనున్నట్టు వెల్లడించారు. వర్షాలొచ్చే నాటికి పనులు పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే పికప్ ఏరు కాలువ గేట్లను పరిశీలించి.. సంబంధిత అధికారలతో సమీక్షించారు. ప్రస్తుతం జలాశయంలో 6.621 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వారి వెంట జలాశయం ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య, సిబ్బంది ఉన్నారు.

# అల్లర్లు చేస్తే కేసులు తప్పవు

- ఏమైనా జరిగితే మాత్రం కఠినంగా వ్యవహరిస్తాం
- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు
- 4వ తేదీ ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం
- జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్, ఎస్పీ మణికంఠ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** ఓట్ల లెక్కింపు రోజున ఏమైనా జరిగితే నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని, అందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి 500 ఓట్లకు ఒక టేబుల్‌ను కేటాయించినట్లు తెలిపారు. జాతీయ, రికగ్నైజెడ్ పార్టీల ఏజెంట్లను కౌంటింగ్ హాల్‌లోకి అనుమతిస్తామన్నారు. గుర్తింపులేని, స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లకు ప్రత్యేకంగా వెయిటింగ్ రూమ్‌ను కేటాయించినట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, నిర్దాక్షిణ్యంగా కేసులు పెడుతామని, ఒకసారి కేసు నమోదైతే జీవితాంతం బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు..**

కౌంటింగ్ రోజున విజయోత్సవ ర్యాలీలు, ఇతర కార్యక్రమాలకు ఎలాంటి అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 15 హాళ్లు, పార్లమెంట్ నియోజకవర్గానికి 7 హాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 3 టేబుళ్లు, పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 18 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజంపేట పార్లమెంట్‌కు సంబంధించి పుంగనూరు నియోజకవర్గం ఈవీఎం ఓట్ల లెక్కింపు వివరాలు రాయచోటికి ఇక్కడ నుంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. చిత్తూరు పార్లమెంట్‌కు సంబంధించి చంద్రగిరి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు వివరాలు తిరుపతి అధికారులు ఇక్కడకు ఇస్తారన్నారు. ఓట్ల లెక్కింపునకు సూపర్‌వైజర్లు 263, సహాయకులు 339, మైక్రో అబ్జర్వర్లు 310 మంది మొత్తం 912 మందిని విధులకు నియమించామన్నారు. జిల్లాలో 3991 మంది సర్వీస్ ఓటర్లు ఉంటే 1005 మంది ఈటీపీబీఎస్ (ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్)లో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

### కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత...

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ అన్నారు. ఓట్ల లెక్కింపు రోజున చిత్తూరు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని, ఒకే చోట నలుగురు అంతకంటే ఎక్కువ మంది ఉండకూడదన్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అల్లర్లు జరుగుతాయనే అనుమానం ఉన్న 260 గ్రామాల్లో పోలీస్ పికెటింగ్, రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామని తెలిపారు. ఎవరైనా అల్లర్లు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ వెల్లడించారు. చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు, డీఆర్ఓ పుల్లయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

### 12 వరకు ఎస్వీ సంగీత కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

**తిరుపతి కల్చరల్ :** టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర డోలు పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను పలు రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ, మృదంగం, డోలు, ఘటం వంటి విభాగాలలో కోర్సులు ఉన్నాయి. ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్ , డిప్లొమా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల వారు కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. ఇతర వివరాలకు 0877-2264597, 7330811173, 9440793205 నంబర్లలో సంప్రదించవచ్చు.

## క్లుప్తంగా

### మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 7వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఉచితంగా మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతని వెల్లడించారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువీకరణపత్రాలు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి. 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### గంధమనేని శివయ్య భార్య మృతి


పారిజాతమ్మ (ఫైల్)

పుత్తూరు: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ (84) ఆదివారం సాయంత్రం పరమపదించారు. పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య 1960వ దశకంలో సీపీఐ పార్టీలో క్రియాశీలక నేతగా పనిచేశారు. 1967లో పుత్తూరు నియోజకవర్గం నుంచి సీపీఐ తరపున పోటీ చేసి 11,205 ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత కాలంలో చెన్నైలో శివయ్య కుటుంబం స్థిరపడింది. భర్త శివయ్య మరణానంతరం ప్రతినెలా ప్రభుత్వం నుంచి పింఛను అందుకుంటున్న పారిజాతమ్మ ఆ నగదును గత నెల వరకు కూడా సీపీఐ పార్టీకి విరాళంగా అందిస్తూ పార్టీ పట్ల తమ కుటుంబానికి గల విధేయతను చాటుకున్నారు. సోమవారం సాయంత్రం చెన్నైలోని కోడంబాక్కం ఎన్‌టీఆర్ స్ట్రీట్‌లోని స్వగృహం నుంచి పారిజాతమ్మ అంత్యక్రియలు ప్రారంభమవుతాయని ఆమె కుమారుడు గౌతమ్ తెలిపారు.

# ఫలితం వచ్చాకే బయటకు

అందరిలో ఒక్కటే ఉత్కంఠ.. జూన్ 4 ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. మరికొన్ని గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జూన్ 4న ఉదయం నుంచే సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. చిత్తూరు జిల్లాకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రం చిత్తూరు నగరం సమీపంలో ఉండడంతో ఇప్పటికే పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు.

- కౌంటింగ్ కేంద్రాల వద్ద రెండు కి.మీ. వరకు 144 సెక్షన్ అమలు
- చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద మూడంచెల పోలీసు భద్రతా వలయం
- అల్లర్లు చేసినా, ఎన్నికల సిబ్బందితో గొడవకు దిగినా కఠిన చర్యలు
- కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు అర్బన్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు చిత్తూరు పార్లమెంటు స్థానానికి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇందుకోసం చిత్తూరు నగరంలోని ఎస్వీ–సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో వసతులు, సౌకర్యాలు సిద్ధం చేశారు. చిత్తూరు, పూతలపట్టు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, గంగాధరనెల్లూరు, నగరి అసెంబ్లీ స్థానాలతో పాటు చిత్తూరు పార్లమెంటు స్థానం ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడే కౌంటింగ్ జరగనుంది. పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓట్లు, ఈవీఎంలోని ఓట్లను లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అధికారులు రాకపోకలను ఇటువైపు నిషేధించి, మరోదారిలో వాహనాలను మళ్లిస్తూ చర్యలు కూడా తీసుకున్నారు.

**భద్రత ఇలా..**

ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఇప్పటికే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన తరగతులు కూడా నిర్వహించారు. వీరంతా ఉదయం 5 గంటలకే ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. కౌంటింగ్ కేంద్రాలకు రెండు కిలోమీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. నలుగురికన్నా ఎక్కువమంది గుంపులు, గుంపులుగా ఉండడానికి వీల్లేదు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల రక్షణ వలయం ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన ఆర్మ్‌డు రిజర్వు, సివిల్ పోలీస్‌తో పాటు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సు, కేంద్ర పోలీసు బలగాలను ఇక్కడ అందుబాటులో ఉంచుతారు. కౌంటింగ్ కేంద్రంలో అల్లర్లు చేసినా, ప్రిసైడింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగినా ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి బయటకు పంపించడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. ఇక ఈవీఎంలను ముట్టుకోవడానికి ప్రయత్నించినా, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందిని అడ్డుకున్నా నాన్‌బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

**గుర్తింపు కార్డులు ఉంటేనే..**

కౌంటింగ్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసే గుర్తింపు కార్డు తప్పనిసరి. గుర్తింపుకార్డు ఉంటేనే సిబ్బందిని గానీ, ఏజెంట్లను గానీ లోపలకు అనుమతిస్తారు. ఎన్నికల సిబ్బందికి ఓ రంగు గుర్తింపుకార్డు, ఏజెంట్లకు మరోరంగు గుర్తింపుకార్డులు జారీ చేశారు. వీరంతా ఒక్కసారి ఓట్ల లెక్కింపు కేంద్రం లోపలకు వెళ్తే మళ్లీ తుది ఫలితాలు వెలువడిన తరువాతే బయటకు రావాలి. అప్పటి వరకు తప్పనిసరిగా లోపలే ఉండాలి. దీనికి తగ్గట్లుగా ఆహారం, తాగునీరు, మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరు.

**ఎలక్ట్రానిక్ పరికరాలకు, పెన్నులకు అనుమతి లేదు**

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు (ఈ నెల 4వ తేదీన) ఉదయం 6 గంటలకల్లా అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అబ్జర్వర్ల సమక్షంలో అభ్యర్థులు, ఏజెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 4వ తేదీన చిత్తూరు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపునకు విచ్చేసే అభ్యర్థులు, ఏజెంట్లు తప్పనిసరిగా ఐడీ కార్డు, ఫారం 18ను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు, పెన్నులను అనుమతించమన్నారు. మెయిన్ గేటు వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సెల్‌ఫోన్‌లు భద్రపరచాలన్నారు. ఎన్నికల సంఘం జారీచేసిన అథారిటీ లెటర్స్ ఉన్న మీడియా ప్రతినిధులు సెల్‌ఫోన్స్ తెచ్చుకోవచ్చని తెలిపారు. సమావేశంలో అబ్జర్వర్లు షాదిక్ అలం, కవిత, భారత్‌భూషణ్, మమత, అఘోరి శశాంక్ సిన్హా, చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి రెడ్డెప్ప, పూతలపట్టు అభ్యర్థి సునీల్‌కుమార్, పలు పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అన్నా.. ఒక్క రూమ్ ప్లీజ్..!

- చిత్తూరులో ఫుల్ అయిన అతిథిగృహాలు
- గదుల్లేక స్కూళ్లు, మండపాలకు డిమాండ్
- ఫలితాల కోసం పెద్దసంఖ్యలో జనం రాక
- సాంకేతిక పరిజ్ఞానంతో ఖాకీల నిఘా

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి చిత్తూరుకు పెద్దఎత్తున పలు రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. నగరానికి ఒక్కసారిగా ఈనెల 3వ తేదీ రాత్రికే అయిదు వేల మంది వస్తారని పోలీసులు అంచనా వేశారు. ఫలితంగా నగరంలోని అన్ని లాడ్జీలు ముందస్తుగా బుక్ అయిపోయాయి. పలుచోట్ల గదుల్లేవంటూ బోర్డులు కూడా పెట్టేశారు.

**రెకమెండేషన్ చేయించినా...**

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చిత్తూరు పార్లమెంటు స్థానానికి సంబంధించి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న విషయం తెలిసిందే. దీంతో చిత్తూరులోని లాడ్జీలకు, హోటళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. గదులు దొరకడం లేదు. కొందరు రాజకీయ నాయకులు పోలీసులతో రెకమెండేషన్ చేయిస్తున్నా గదులు ఖాళీలేవని లాడ్జీల నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు మొత్తం కలిపి 600 మంది వరకు చిత్తూరుకు వస్తారని అంచనా.

**మండపాలకు గిరాకీ..**

చిత్తూరు నగరంలో ఉన్న 28 లాడ్జీలతో పాటు కాణిపాకంలోని లాడ్జిలు సైతం ఇప్పటికే బుక్ అయిపోయాయి. చాలామందికి గదులు దొరకలేదు. దీంతో పలువురు కల్యాణ మండపాలను అద్దెకు తీసుకోగా.. మరికొందరు విద్యాసంస్థలను అద్దెకు తీసుకుంటున్నారు. వేసవి సెలవులు, పెళ్లి ముహూర్తాలు పెద్దగా లేకపోవడంతో విద్యాసంస్థలకు, కల్యాణ మండపాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. దీనికితోడు భోజనాలు కూడా అక్కడే తయారు చేయిస్తున్నారు. అలాగే పాలసముద్రం, తమిళనాడులోని వేలూరు, కాట్పాడి ప్రాంతాల్లో కూడా చాలామంది లాడ్జీల్లో గదులు బుక్ చేసుకున్నారు.

**ఆదాయం అదుర్స్..**

ఓట్ల లెక్కింపుతో చిత్తూరు నగరానికి అదనపు ఆదాయం లభించినట్టింది. లాడ్జీలతో పాటు పలు విద్యాసంస్థలు, కల్యాణ మండపాలు అద్దెకు ఇవ్వడంతో నిర్వాహకులకు ఆదాయం చేకూరింది. ఇక హోటళ్లలో మాంసాహార, శాఖాహార భోజనాలతో పాటు అల్పాహారం కూడా ముందుగానే ఆర్డర్లు ఇచ్చేశారు.

# బోయకొండకు భారీ ఆదాయం


ఆలయంలో భక్తుల రద్దీ

- 30 వేలకు పైగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు
- ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం ఒక్కరోజే వివిధ సేవా టికెట్లు, ప్రసాదాల కొనుగోలుతో రూ.11.60 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి ఈ ఓ చంద్రమౌళి తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు పరీక్షల ఫలితాలు వెలువడడంతో యువతతో పాటు కోరిన కోర్కెలు ఫలించిన భక్తులు సుమారు 30 వేలమందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి దర్శనభాగ్యం కల్పించారు. చైర్మన్, ఈఓల పర్యవేక్షణలో ఉచిత తీర్థప్రసాదాలను అందజేశారు.

## పిడుగుపాటుకు ఐదు పాడి ఆవుల మృతి


మృతి చెందిన పాడి ఆవులు

పుత్తూరు: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం పంచాయతీ జయరాణిపురం గ్రామంలో ఆదివారం పిడుగు పడి ఐదు పాడి ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళా పాడిరైతు ఆవులపైనే ఆధారపడి జీవిస్తోంది. ఈ నేపథ్యంలో చింతమాను వద్ద కట్టేసిన అన్ని ఆవులు పిడుగు పడడంతో మృతి చెందాయి. ఆవులు మృతి చెందిన విషయం తెలిసి శ్యామల బోరున విలపించింది. జీవనోపాధి కోల్పోయిన తనను ఆదుకోవాలని శ్యామల, గ్రామస్తులు సైతం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గాలివానకు రూ.25 లక్షల నష్టం


పెనుమూరులో నేలవాలిన కరెంటు స్తంభం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం వచ్చిన గాలివానకు విద్యుత్‌శాఖకు నష్టం ఏర్పడింది. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు. మొత్తం కరెంటు స్తంభాలు 29, సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 4, 16 కేవీఏ 5, 15 కేవీఏ 5, 25 కేవీఏ 6, 63 కేవీఏ 1, 100 కేవీఏ 4, 180 మీటర్ల కేబుల్స్ దెబ్బతిన్నట్లు ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. దీంతో విద్యుత్‌శాఖకు రూ.25 లక్షలు నష్టం వచ్చిందని వివరించారు.

## రూ.10 లక్షల సీజ్


నగదును సీజ్ చేసిన పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు టూటౌన్ పోలీసులు ఆదివారం రూ.10 లక్షల నగదు సీజ్ చేశారు. తోటపాళ్యం వద్ద వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో చిత్తూరు మండలం పచ్చన్నపల్లి గ్రామానికి చెందిన జ్ఞానశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు నగదును సీజ్ చేశారు. అనంతరం మీడియాకు పోలీసులు వివరాలు వెల్లడించారు.

# వేడుకగా అర్జున తపస్మాన్


తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జున వేషధారి

ఐరాల: మండలంలోని బెస్తపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి మహాభారత ఉత్సవాల్లో అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన అర్జున తపస్మాన్ భక్తులను ఆకట్టుకుంది. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి తపస్సుమాను మెట్టు మెట్టునూ అధిరోహిస్తూ శివుడి పాటలు, పద్యాలు ఆలపిస్తూ పైభాగానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అర్జున వేషధారి విసిరిన పండ్లు, పూలు మొదలైన వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను కింద వరపడి స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉభయదారులుగా గజేంద్ర, వసంత కుటుంబసభ్యులు వ్యవహరించారు.

# పవిత్రం..హనుమ జన్మస్థలం


వేద పఠనంలో పండితులు, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తదితరులు

తిరుమల: హనుమంతుడు జన్మస్థలం అంజనాద్రి పవిత్ర పుణ్యస్థలమని రాయల్ చెరువు శక్తి పీఠం రమ్యానంద భారతి తెలిపారు. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జాపాలి తీర్థంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రమ్యానంద భారతి అనుగ్రహ భాషణం చేస్తూ, అంజనాదేవికి వాయుదేవుని వల్ల తాను జన్మించినట్లు హనుమంతుడు సీతాదేవికి తెలిపారన్నారు. మాతంగ మహర్షి చెప్పిన విధంగా అంజనాదేవి వేంకటాచలానికి విచ్చేయడం, అక్కడ తపస్సు చేయడం, ఆంజనేయస్వామికి జన్మనివ్వడం, తదనుగుణంగా ఆ కొండకు ।అంజనాద్రి। అని పేరు వచ్చిందని వెల్లడించారు. బాలాంజనేయస్వామి సూర్యదేవుని పట్టుకోవడానికి వేంకటాద్రి నుంచి లంఘించడం, శ్రీరాముని దర్శనానంతరం సీతాన్వేషణలో భాగంగా తిరిగి వేంకటగిరికి రావడం, ఇక్కడ అంజనాదేవిని మళ్లీ చూడడం, వానర వీరులు వైకుంఠ గుహలో ప్రవేశించడం.. ఇలా అనేక విషయాలు వేంకటాచల మహత్యం ద్వారా తెలుస్తున్నాయని వివరించారు. అనంతరం స్వామీజీని ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేక అధికారి విభీషణ శర్మ ఘనంగా సత్కరించారు.


రమ్యానంద భారతి స్వామిని సత్కరిస్తున్న విభీషణశర్మ తదితరులు

**ఆకాశగంగలో..**

ఆకాశగంగలోని బాలాంజనేయస్వామివారి ఆలయం వద్ద శనివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకుడు ఆచార్య రాఘవాచార్యులవారు హనుమంతుని జన్మ విశేషాలు వివరించారు.

**జాపాలి క్షేత్రంలో..**

జాపాలి క్షేత్రంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీమతి రేవతి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రవి సుబ్రమణ్యం గాత్ర సంగీతం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు తిరుపతికి చెందిన ప్రసన్న లక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సరస్వతీ ప్రసాద్ హరికథ గానం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి: ఆగి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కోదండరామాపురం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీకి చెందిన అమ్ములు(35) అగ్రికల్చర్ కళాశాలలోని మెస్‌లో పనిచేస్తోంది. పెరుమాళ్లపల్లి పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన విశ్వనాథ్(25) ఆమెతోపాటు కలసి అక్కడే పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ వ్యక్తిగత పనులు నిమిత్తం ఆదివారం హోండా యాక్టివా వాహనంలో చిత్తూరుకు వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి తిరుపతికి పయనమయ్యారు. మార్గం మధ్యలో కోదండరామాపురం వద్ద వస్తున్న క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో విశ్వనాథ్‌తో పాటు అమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సీఐ రామయ్య మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై స్థానికులతో విచారించారు. అనంతరం మృతదేహాలను తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.